# మార్గదర్శి

పద్మశ్రీలకు... పతకాలకు రికమెండేషన్ వుంటే చాలు వచ్చి ఒడిలోవాల్తున్న రోజులివి! పలుకుబడి వున్న వారి పాదాల ముందు వాల్తయ్. వాడు భోజనానికి కడపంక్తిలో కూర్చున్నా అన్నీ వడ్డించినట్టు రికమెండేషన్ వుండాలేగాని పని అంటూ వుండదు!

భానుమూర్తి మేష్టారి విషయం అందుకు భిన్నం ! వృత్తినే దైవంగ భావించే మనిషి. మొద్దబ్బాయిలకు సైతం విద్య నూరిపోస్తాడు.

ట్యూషన్లు చెప్పడు! అధిక ఆదాయం కోసం వెంపర్లాడడు! రికమెండేషన్లు పనిచెయ్యవు. ఎవరినీ నోరు తెరిచి సాయం అడగడు. చెయ్యి చాచా యాచించడు!

అతగాడికి స్థిర చరాస్తులంటూ ఏమీలేవు. అద్దెకొంపంలోనే కాపురం! భార్య ముగ్గురు ఆడపిల్లలు ఆయన సంసారం!. ఇల్లు బడి తప్ప మరో చోటుకుపోడు. స్నేతుల్లేరు. చెడ్డ అలవాట్లకు దూరం!.

ఆయనపట్ల అందరికీ అపారమైన గౌరవం! విద్యా ప్రమాణాలు నానాటికీ పడిపోతున్నందుకు కేవలం బాధపడటమే కాకుండా అధికారగణానికి ప్రభుత్వానికి తగిన సూచనలు... సలహాలు ఇస్తూంటాడు. ఎవరికి వారే యమునా తీరే ! చెప్పే వారేరి? అథవా చెప్పినా... చెవినేసుకుని మంచిని ఆచరించే వారెక్కడున్నారు నేటి సమాజంలో!. సలహాలన్నీ బూడిదలో పోసిన పన్నీరే!.

రాజకీయాలలో... ముఠా తగాదాలతో... రౌడీయిజంతో... కిడ్నాపులతో... దొంగతనాలతో... సామూహిక మానభంగాలతో ఈ వ్యవస్థ కుళ్లిపోతున్నాందుకు అనుక్షణం బాధపడతాడు. ఈ మనుష్యులను మార్చటం తన వక్కడివల్లా అవుతుందానే శంక మరోవైపు. తానేమైనా సంఘసంస్కర్తా? కేవలం ఉపాధ్యాయుడు! విద్యార్థులకు గురువు. వారిని సరైన దారిలో నడిపించటమే తన కర్తవ్యంగ భావిస్తాడు భానుమూర్తి. తనది కాని విషయాల జోలికిపోడు. ఇతరుల విషయాల్లో తలదూర్చడు.

ఉన్నా లేకున్నా సమస్యలంటూ పరిష్కారం కోసం వీధిన పడటం... సమ్మెలు చేయటం.. నిరాహార దీక్షలకు పూనుకోవటం... వంటివి భానుమూర్తికి గిట్టవ్!

వృత్తి... వ్యక్తి... గౌంవాన్ని కించపరిచే విధంగ ప్రవర్తించటమంటే అతనికి

ఏవగించవు. క్రమశిక్షణ పేరుతో స్టూడెంట్‌ను బెత్తంతో దండిస్తాడని భానుమూర్తికి పేరు! తమ సంతానాన్ని తల్లితండ్రీ పట్టించుకోనప్పుడు గురువుగ తానైనా విద్యార్థులను సరైన దారిలో నడిపాచటానికే దండిస్తూంటాడు... ఇది తప్పెలా అవుతుంది అనేది భానుమూర్తి వాదన. కానీ చట్టం దృష్టిలో నేరమైంది నేడు!

మిడిమిడి చదువులు... బట్టీయం వేసిన వారికి ర్యాంకులు రావటం...విషయ పరిజ్ఞానం కరువైనా... పిల్లలను ఆకాశానికి ఎత్తేయటం భానుమూర్తి పూర్తి వ్యతిరేకి.

ఇప్పుడంటే కాన్వెంటు చదువులొచ్చాకి గాని వెనుకటిరోజుల్లో వీధి బడులే గతి! అప్పుడు మాత్రం విద్యార్థులు చదువుకుని వృద్ధిలోకి రాలేదానేది ఆయన వాదన! ఆనాటి బోధనా విధానాలే వేరు! ఈనడు అది రివర్స్!

ఉద్యోగం కోసం... ఉదరపోషణకోసమే నేటి చదువులు! విజ్ఞానం కోసం కాదు. చదువుకు తగిన వుద్యోగాలు ఎక్కడ వచ్చేడుస్తున్నాయ్? కులవృత్తుల పట్ల విముఖత, నిరుద్యోగ భృతికోసం ఆరాటం... పోరాటం!

భానుమూర్తి లాంటి తెలవైన వ్యక్తి ఏ కలక్టరో కావలసింది. కానీ ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకున్నాడు. ఇది వారసత్వ సంపదగా భావించాడు. తాతల తండ్రుల కాలం నుంచి అందరూ ఉపాధ్యా వృత్తే గౌరవమైనదిగా భావించి దాన్నే కౌగిలించుకున్నారు.

దిశనిర్దేశం లేని నేటి యువత పయనం ఎటు అనే ప్రశ్న భానుమూర్తిని అనుక్షణం వేధిస్తోంది. అంతా గందరగోళంగ అయోమయంగ వున్న నేటి పరిస్థితి చూస్తూ మానసిక బాధకు లోను కాక తప్పటంలేదు.

నాగరికత వ్యామోహంలోపడి కొట్టుకుపోతూ... చెడు స్నేహాలు అలవాట్లు మరిగిన యువత దొంగలుగ, హంతకులుగ మారుతున్నందుకు భానుమూర్తి మనసు వ్యాకులపడసాగింది.

ఇలాంటి వికృత పోకడలు... నిరుద్యోగ యువతను... విద్యార్థులను పెడదోవనపట్టిస్తూ నిర్వీర్యం చేయటం చూస్తూ భానుమూర్తి మనసు ఆవేదనకు గురవుతోంది.

దీనంతటికీ కారణం... కన్నవారి పెంపకం లోపమా? క్రమశిక్షణ కరువగుట కారణమా? ఇందులో సమాజం... ప్రబత్వ బాధ్యత ఎంత? దీని గురించే అనుక్షణం

భానుమూర్తి ఆలోచన!

వీరిని దండించే అధికారం ఉపాధ్యాయులకు లేకపోవటం... తల్లిదండ్రుల నిర్లక్ష్యమేనని గొంతు చించుకుంటూ ఎవరికివారు చేతులు దులుపుకుని నిమ్మకు నీరెత్తినట్లు వారి చర్యలను కేవలం చట్టపరిధిలోకి తీసుకుని నామ్‌కే వాస్తే శిక్ష విధించి వదిలేయటం... ఎంతవరకు సముచితం! పట్టుబడిన నేరస్తుల ముఖాలకు ముసుగులు దేనికిట?. దొంగతనాలకు పాల్పడిన వారి ముఖాలను బహిరంగపర్చటంలో తప్పేముందని? కఠిన దండన ఎప్పుడు కరువౌతుందో అప్పుడే అనర్థాలు పెచ్చుమీరుతుంటయ్ అన్పిస్తూంటుంది భానుమూర్తికి.

X X X

తన స్టూడెంట్ బి.టెక్. చదివి, చదువుకు తగిన వుద్యోగం దొరక్కపోవటంతో నిరాశ చెందితే... ప్రభుత్వాన్ని... సమాజాన్ని నిందించక... స్వయం ఉపాధి పథకం సాయంతో బ్యాంకులోను తీసుకున్ని చిన్న సైజు వ్యాపారం ప్రారంభించటం భానుమూర్తికి అపరిమితమైనా ఆనందాని కల్గించటంతో అతడిని కలిసి అభినందించాడు.

ఎం.బి.ఏ. చదివిన మరో విద్యార్థి తన దృష్టిని కులవృత్తివైపు మరలించి.. తన చదువుకు తగిన వుద్యోగం దొరకనందుకు నిరాశ చెందక... డ్రైక్లీనింగ్ షాప్ ప్రారంభించటం... భానుమూర్తి మనసు ఎంతో తృప్తి చెందించి.

కులవృత్తి నామర్దాగ భావించని మరికొంతమంది... నామోషిని విడనాడి తాము డిగ్రీలు పొందినా... స్వతంత్రంగ సెలూన్ షాపులు బ్యాంకులోను సాయంతో తృప్తిగ నడుపుతూ బతకటం చూచి పరవశించాడు భానుమూర్తి.

కొందరైతే... కేటరింగ్ ప్రొఫెషన్ చేపట్టి లాభాల బాటలో నడుస్తున్నారు. తన కొలీగ్ కొడుకు చేత చెప్పుల షాప్ ఓపెన్ చేయించాడని తెలిసి భానుమూర్తి మురిసిపోయాడు.

అవునుమరి! విద్యావంతులందరికీ ప్రభుత్వోద్యాగాలు సమకూర్చటం ప్రభుత్వతరామా?- ఈ వాస్తవాన్ని గ్రహించి అర్థం చేసుకోగలిగిన యువత వారివారి నిర్ణయానుసారంగ ఎవరి బ్రతుకు బాట వారు వెతుక్కుని సుఖపడుతూండటం చూచి ఎంతో తృప్తి చెందుతున్నాడు.

ఈ మార్పే తాను కోరుకుంది! నిరుద్యోగ యువత ఈ దారిలో నడిస్తే ఇంకేముంది? రాష్ట్రం భూతల స్వర్గంలా మారదూ?!. అప్పుడు దేశం రూపురేఖలే మారతయ్ అన్పించింది.

క్రమశిక్షణే అందరి భవితకు దిక్సూచి! గౌరవ మర్యాదలు ఇచ్చిపుచ్చుకోవటమనే అంశం అందరిలోనూ వెల్లివిరియాలి! ఒకప్పుడు బ్రతక లేక బడిపంతులు అనే సామెత అందరినోటా నానేది నేడది తల్లకిందులై బ్రతకటానికి బడిపంతులుగా రూపుదిద్దుకుంది.

భానుమూర్తికి ముగ్గురూ ఆడపిల్లలే ! వెనకటిరోజుల్లో పంతుళ్లకు పల్లలెక్కువ అనేవారు. నేడి కి.ని. ఆపరేషన్ విధానం అమలై చిన్న కుటుంబాలే చింతలేని కుటుంబాలైనయ్.

ముగ్గురూ ఆడపిల్లలే అయినా చదువులో... తెలివితేటల్లో మెరికలు!. టెన్త్‌లో స్కూలు ఫస్ట్ డిగ్రీలో స్టేట్ ఫస్టొచ్చి కన్నవారి పేరు నిలబెట్టారు. మగబిడ్డల్లేరనే చింత లేనేలేదు భానుమూర్తి దంపతులకు.

జిల్లాలోనే కాదు... రాష్ట్రంలోనే ఉత్తమ ఉపాధ్యాయుడనే మంచి పేరుంది భానుమూర్తికి. అనేకసార్లు ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రతిపాదించినా రాజకీయ వొత్తిడివల్ల ఇతరులు ఆ అవకాశాన్ని అదృష్టాన్నీ డేగల్లా తన్నుకు పోయారనే విషయం తెలిసినా భానుమూరి కించుత్తైనా బాధపడ్లేదు. తనకు ప్రాప్తం లేదనుకున్నాడంతే !. ఎవరి కాళ్ళూ పట్టుకోని వాడవటంవల్ల... కీర్తి కాంక్ష కొరకై వెంపర్లాడలేదు!.

భానుమూర్తి అంతరంగంలో వున్న బాధల్లా... నేటి తరం విద్యార్థుల గురించే!. వారి భవిత గురించే మదనపడుతూంటాడు. వారిని చక్కదిద్ది సరైన మార్గంలో నడిపించటానికి అహర్నివలు శ్రమిస్తూంటాడు. టీచర్లపై విద్యార్థులు తిరగబడటం... దాడులు చేయటం... అసభ్యపదజాలంతో దూశించటం వంటి సంఘటనలు సమాజంలో చోటుచేసు కున్నందకు... భానుమూర్తి మనసు విలవిల్లాడుతుంది!. తనకే పరాభవం జరిగినట్టు ఫీలైపోతూంటాడు.

వెనకటి రోజుల్లో టీచర్లంటే విద్యార్థులకు ఎంత గౌరవం?... ఎంత మర్యాద?... టువంటి సంఘటనలు కనీవినీ ఎరుగడు.

X X X

ప్రాపంచిక విషయాలను వీడి... పెళ్లీడుకొచ్చిన తన ముగ్గురు ఆడపిల్లల వివాహం చేయటం గురించి ఆలోచించసాగాడు.

స్వయంకృషితో వృద్ధిలోకొచ్చి గ్రాడ్యుయేట్లై సర్వీసు కమీషన్ ఎగ్జామ్స్ పాసై ప్రభుత్వోద్యోగాల్లో స్థిరపడిన కూతుళ్లను చూచి మురుస్తూంటాడు. కానీ వాళ్ల పెళ్లిల్లు జరిపాచటానికి కావలసిన ఆర్థిక స్తోమత లేనందువల్లే సంబంధాల కోసం వెతకటం ప్రారంభించక నిస్సహాయుడైనాడు భానుమూర్తి.

సంపాదనంతా ఇంటిల్లిపాదీ తిండి ఖర్చుకు ఇతర అవసరాలకు... పిల్లల చదవులకు బొటాబటీలుగ సరిపోతూరావటం వల్ల బ్యాంకు బేలెన్స్ లేకుండాపోయింది.

చేతిలో చిల్లిగవ్వలేని తాను ముగ్గురు ఆడపిల్లల వివాహాలు జరిపించటమంటే మాటలా? కనీసం... ఎంతలేదన్నా... అయిదారు లక్షలు చేతిలో వుంటేనేగాని అత్తవారిళ్లకు పంపటం సాధ్యపడదు.

పిల్లలు అందాల భరిణెలైనా... చక్కదనాల చుక్కలే అయినా... ప్రభుత్వోద్యోగం చేస్తున్నా... కట్నం ఇవ్వక తప్పదు. ఈ సమస్యకు పరిష్కారమార్గం కన్పించక భానుమూర్తి తెగ 'వర్రీ' అవుతున్నాడు. పిల్లలకు వయసు మించిపోతే.. ఎవ్వరూ చేసుకుందుకు ముందుకు రారు! ఇది తనకెంత అప్రతిష్ఠ? - సమస్యలకు భయపడి దూరంగ పారిపోవటానికి ఒక తండ్రిగా మనస్కరించకుండా వుంది.

పిల్లలతో పెళ్లి విషయం చర్చించి నిర్ణయానికి రావటమే పరిష్కారమార్గంగా తోచింది.

భార్య ముగ్గురు కుమార్తెలతో ఒక ఆదివారంనాడు రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ ఏర్పాటి చేశాడు భానుమూర్తి.

తండ్రి ఇలా మీటింగ్ పెట్టటంలో గల అంతరార్థాన్ని ఇట్టే పసికట్టేశారు సిస్టర్స్ ముగ్గురూ! పైకి మాత్రం ఏమీ ఎరుగని నంగనాచి తుంగబుర్రల్లా మౌనం దాల్చారు.

వారిమధ్య నిశ్శబ్దం తాండవిస్తోంది!. ఎలా మొదలుపెట్టాలాని తికమకపడుతోంది భానుమూర్తి మనసు. ఒకరి ముఖాలు మరొకరు చూసుకుంటున్నారు.

పిల్లల పెళ్ళి విషయం కాబట్టి భార్య మాట్లాడితేనే సమంజసంగా ఉంటుందని భానుమూర్తి... ఇంటిపెద్ద కాబట్టి ర్త మనసులోమాట బైటపెడితే అర్థవంతంగ

వుంటుందని భార్య హైమావతి... పిల్లలే మాట్లాడాలనిపెద్దలిద్దరూ నిరీక్షించసాగారు.

సైలెన్స్‌ను భరించలేక 'డాడీ! ఎందుకు మనమంతా ఈ గదిలో ఒకేచోట కూర్చున్నామో మీరు చెప్తేనే బాగుంటుంది...' పెద్దపిల్ల మహి డైలాగ్ ఓపెన్ చేసింది.

భానుమూర్తి భర్త ముఖంలోకి చూశాడు. ఇక లాభంలేదనుకున్న హైమావతి 'చూడండ్రా పిల్లలూ... మీకెలాంటి భర్తలను తేవాలాని మీ డాడీ మధనపడుతున్నారు. మీ ఆలోచనేమిలో కూడా మా చెప్పెయ్యండి....' భళ్లున అనేసింది.

'డాడీ వద్ద డబ్బెక్కడిది మమ్మీ! పాపం పూర్ డాడీ కదా.... మనందరి తిండికి... అవసరాలకు... మా చదవులకే సరిపోయింది డాడీ నెలజీతం!...' సింపతీ ప్రదర్శించిది రెండో కూతురు నందిని.

అవునవునంటూ కోరస్ ఆలపించారు నెంబర్‌వన్ అండ్ త్రీ!

'అంతమాత్రాన మీకు పెళ్లిళ్లు చేసి మా బాధ్యత తీర్చుకోవద్దా ఏమిటీ?... హైమవతి బుగ్గలు నొక్కుకుంది.

'మీరు చదువుకుని వుద్యోగాలు చేస్తూ సంపాదిస్తున్న ఆడపిల్లలయిపోతిరి!. మీవంటి వారికి గంతకు తగ్గ బొంత అనేసి దారినపోయే దానయ్య చేతిలో పెట్టలేం కదా?...' భానుమూర్తి గొంతులోంచి వూడిపడ్డయ్ మాటలు.

'పెళ్లి చేసుకోకుండా ఇలాగే కన్యలుగా మిగిలిపోతామా ఏమిటీ?- మా వుద్యోగం... సంపాదన మాకుంది. కనుక... మా మనసుకు నచ్చినవాడిని మేం ఎన్నుకుంటాం... ఏంతప్పా డాడీ?-' చివరి పిల్ల అరుణ ఆరిందలా మాట్లాడింది.

'మన ఎరికలో అయిన సంబంధాలు లేవు కాబట్టి పరాయి మగపిల్లల కోసం వెతక్కతప్పదు. కొత్తవారిని కదిలిస్తే కట్నంకోసం కందిరీగలాలగ కుట్టి చంపేస్తారు...' చెప్తూ ఆగింది.

'డాడీ! మా వివాహం గురించి వర్రీ అవకండి. మ్యారేజ్ విషయం మాకు వదలేయండి?. మేము ఈ విషయంలో మిమ్ము ఇబ్బందిపెట్టం. సరేనా?- పెళ్లిఖర్చు... కట్నాల ఖర్చు లేకుండా వుండాలనేదే మా ఆలోచన...' పెద్దపిల్ల మహి కుండబద్దలు కొట్టేసింది.

'అంటే... మీ ముగ్గురూ.. ప్రేమలో పడ్డారా ఏమిటీ కొంపదీసి?-' నిశ్చేష్టురాలై ప్రశ్నించింది. పిల్లల మఖాల్లోకి చూస్తూ హైమవతి.

కూతుళ్ళ ఫేస్ రీడింగ్ స్టడీ చేయటంలో నిమగ్నమైనాడు భానుమూర్తి.

'యువార్ రైట్ మమ్మీ!. మా లైఫ్ పార్ట్నర్స్ మాకు దొరికారు. మీకు నో వర్రీస్. ఇన్నాళ్లూ మీరేమనుకుంటారోని చెప్పలేకపోయాం. ఇప్పుడు సమయం వచ్చింది కదాని పెండోరాస్ బాక్స్ ఓపెన్ చేసేశాం...' కిలకిలా నవ్వింది కడగొట్టుపిల్ల అరుణ.

భానుమూర్తి మనిషి కొయ్యబారిపోయాడు. హైమావతి నోటికి పక్షవాతం వచ్చినట్టయింది.

'మిమ్మల్ని కించపరచాలని... మీ మనోభావాలను దెబ్బతీయాలనేది మా అభిమతం కాదు డాడీ!. మన కుటుంబ ఆర్థిక పరిస్థితి ఎరిగినవారం కాబట్టి మనసుకున నచ్చిన కొలీగ్స్‌ను ఎంచుకున్నాం. ఇష్టపడ్డాం! దట్సాల్ డాడీ...' నందిని ఫ్యాక్ట్ మాట్లాడింది.

తన అశక్తతకు సిగ్గుపడ్డాడు భానుమూర్తి. తన చేతగాని తనానికి నొచ్చుకున్నాడు. పిల్లల నిర్ణయంలో తప్పులేదన్పించింది. తనకు ఇష్టమున్నా లేకున్నా తలాడించక తప్పదన్పించింది.

'అయితే ఇంకేం?... కుర్రాళ్లు మంచివాళ్లు... బుద్ధిమంతులని మీరు భావిస్తే కన్యాదానం చేయటానికి మాకు అభ్యంతరం లేదర్రా.. అంగీకారసూచనగా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వటానికి వెనుకాడం. ఓ.కే. కద?!-' తన మనసులో మాట చెప్పాడు.

తండ్రి డెసిషన్ విన్న ముగ్గురు ఆడపిల్లలూ తమ నిర్ణయం సరైనదైనందుకు కిలకిలా నవ్వారు. హైమావతీ తలాడించింది!!

మాకు తండ్రే మార్గదర్శి అనుకున్నారు ముగ్గురు కుమార్తెలు !

--- సమాప్తం ---